01ATP23_01ATP23.qxd 23-11-2024 PM 10:44 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 24 నవంబర్ 2024 పేజీలు : 04

# సత్యసాయి జన్మదినం మానవాళికి పర్వదినం

**వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్, మంత్రులు, ఎమ్మెల్యేలు**
**వైభవంగా స్వర్ణ రథోత్సవం, జోల మహోత్సవం**
**అంబరాన్నంటిన సత్యసాయి జన్మదిన సంబరాలు**



సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్,మంత్రులు ఎమ్మెల్యేలు



వార్షిక నివేదికను విడుదల చేస్తున్న, గవర్నర్, ట్రస్ట్ సభ్యులు

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 23 ప్రభాతవార్త**
ప్రపంచ మానవాళికి విద్యా, వైద్య, త్రాగునీరు అందించిన అపర భగీరధుడు ప్రశాంతి నిలయ సత్యసాయిషుని 99 వ జయంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఈ వేడు కలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్,

మిగతా 4లో...

## సమీక్షలతో బాలయ్య బిజీ బిజీ

- పోలీస్, మున్సిపల్ అధికారుల సమావేశం



సమీక్షల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు

**హిందూపురం నవంబర్ 23 ప్రభాతవార్త**
ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురానికి వచ్చిన సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు జిల్లా ఎస్పీ రత్న పుష్పగుచ్ఛం అందించారు. డి.ఎస్.పి మహేష్, సిఐలు రాజగోపాల్ నాయుడు, కరీం, జనార్ధన్ సమీక్షల్లో పాల్గొన్నారు. ఇటీవల చిలమత్తూరు మండలంలో జరిగిన గ్యాంగ్ రేప్ దర్యాప్తు, నియోజక వర్గంలో గంజాయి విక్రయాల వ్యవహారం, శాంతిభద్రతలు, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రయత్నాలు మొదలగు వాటిని బాలయ్యకు అధికారులు వివరించారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. పట్టణంలో రైల్వే రోడ్డు, ధనలక్ష్మి రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి మ్యాపులను బాలయ్యకు చూపించారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల డ్రైనేజీల అభివృద్ధికి రూ. 92 కోట్ల ప్రతిపాదనలు మంజూరు దశకు చేరుకున్నాయని, నీటి సరఫరా, అండర్ డ్రైనేజ్ నిర్మాణం సంబంధించి ప్రతిపాదనలను వివరించారు. సమీక్షలో ఎమ్మెల్యే కార్యదర్శి శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు.



అభివృద్ధి మ్యాప్‌ను వివరిస్తున్న కమిషనర్ ←

## రాహుల్ కి రాజ్యాంగమంటే అర్థం కూడా తెలియదు

- మోదీ నాయకత్వాన్ని మహారాష్ట్ర ప్రజలు విశ్వసించారు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**శ్రీ సత్యసాయి జిల్లా, నవంబర్ 23, ప్రభాతవార్త ప్రతినిధి**
రాజ్యాంగం అనే పదానికి రాహుల్ గాంధీకి అర్థం కూడా తెలియదని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మహారాష్ట్ర ప్రజలు విశ్వసించారని ఆయన పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బిజెపి మూల సిద్ధాంతమైన అంత్యోదయకు పట్టం కట్టారన్నారు. విశ్వ నాయకుడిగా ఎదిగిన నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల అక్కడి ప్రజలు విశ్వాసం ప్రకటించారన్నారు. మహారాష్ట్రలో వరుసగా మూడోసారి విజయం సాధించడం సంచలనమేనన్నారు. గత లోక్ సభ ఎన్నికలలో బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు తొలగిస్తారని చేసిన అసత్య ప్రచారం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో

మిగతా 4లో...

# బస్సు, ఆటో ఢీకొని ఏడుగురు మృతి

**ఆరుగురికి తీవ్ర గాయాలు**









**గార్లదిన్నె, నవంబర్ 23 ప్రభాతవార్త**
వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనాస్థలిలో ఇద్దరు మృతి చెందగా హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మరో ఇద్దరు, చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసుపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.జిల్లాలోని కుట్లూరు మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు ఆటోలో గార్లదిన్నె పని కోసం వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందగా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మరో ఇద్దరు చికిత్స పొందుతూ మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.మృతులు తాతయ్య (55), చిననాగమ్మ (48), రామాంజనమ్మ (48), పెదనాగమ్మ (60), కొండమ్మ, జయరాముడు, చిననాగన్నగా గుర్తించారు. ఘటనాస్థలిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ వెంకటేశ్వరులు పరిశీలించారు. ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించారు.

సీఎం చంద్రబాబు విచారం: ఈ రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడటంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చిన సీఎం ఒక్కో మృతుని కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## దశలవారిగా తుంగభద్ర డ్యాం గేట్ల మార్పునకు గ్రీన్ సిగ్నల్

- గేట్ల మార్పిడి పై సుదీర్ఘ చర్చ
- అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ ప్రతినిధి



బోర్డు సమావేశ దృశ్యం

**అనంతపురం, నవంబర్ 23, (ప్రభాతవార్త బ్యూరో)**
ఆంధ్ర, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్ట్ అయిన తుంగభద్ర జలాశయం గేట్లను మార్చాలన్న తుంగభద్ర బోర్డు ప్రతిపాదనకు దశలివారీగా మార్పు కు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ అధికారులు అంగీకరించారు.. గేట్ల మార్పిడి పై నిపుణుడు బజాజ్ ఇచ్చిన నివేదిక పై సభ్యులు పూర్తిస్థాయిలో చర్చించారు. టీబి బోర్డు ఛైర్మన్ ఎస్ ఎన్ పాండే అధ్యక్షతన శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో తుంగభద్ర జలాశయం 33 గేట్లు మార్చాలని ప్రతిపాదించారు. కేంద్ర జలవనుల శాఖ సంయుక్త కార్యదర్శి రిచా మిశ్రా, తెలంగాణ ప్రతినిధి అనిల్ కుమారుర్ లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గేట్ల మార్పిడిపై తమ అభిప్రాయాలు తెలియజేశారు. కర్ణాటక ప్రతినిధిగా జలవనరుల శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి కులకర్ణి , ఆంధ్ర ప్రతినిధిగా చీఫ్ ఇంజనీర్ నాగరాజు తదితర అధికారులు హాజరయ్యారు. సమావేశంలో గేట్లు దశలవారీగా మార్చాలని ఏకాభిప్రాయంతో వచ్చారు ఇదే సమయంలో జాతీయ జలాశయ భద్రతా సంస్థ కు లేఖ రాసి గేట్ల మార్పుడి పై తమ అభిప్రాయాలు తెలుసుకోవాలని కొందరు సభ్యులు కోరినట్లు తెలిసింది. ఇప్పుడు నిపుణుడు ఇచ్చిన నివేదికతో పాటు రెండో అభిప్రాయాన్ని కూడా తీసుకుంటే బాగుంటుందని, అందుకు లేఖ రాయాలని సభ్యులు కోరారు .కొత్త గేట్లు అమర్చాలని నిపుణుల కమిటీ నివేదికను బోర్డు సమావేశంలో సభ్య కార్యదర్శి ఓఆర్కే రెడ్డి ప్రవేశ పెట్టారు. దీనిని మూడు రాష్ట్రాల అధికారులు ఆమోదించారు.దశల వారీగా గేట్లను మార్చాలని అధికారులు నిర్ణయించారు.. ఇదే సమయంలో తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో కర్ణాటక ప్రభుత్వం తమ అవసరాల కోసం నిర్మిస్తున్న నలిని ప్రాజెక్టుకు టీవీ బోర్డు అనుమతి ఇవ్వాలని కర్ణాటక ప్రతినిధి సమావేశంలో కోరగా తెలంగాణ ప్రతినిధి వ్యతిరేకిచ్చినట్లు తెలియ వచ్చింది..

## గవర్నర్‌కు పుట్టపర్తిలో ఘనస్వాగతం

**పుట్టపర్తి టౌన్ నవంబర్ 23 ప్రభాతవార్త**



గవర్నర్కు స్వాగతం పలుకుతున్న ఆర్జే రత్నాకర్

భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్కు ఘనస్వాగతం లభించింది. శుక్రవారం రాత్రి 12 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ బెంగళూరు నుంచి ప్రశాంతి నిలయానికి కారులో వచ్చారు. ఇక్కడ సాయి శ్రీనివాస అతిథి గృహంలో గవర్నర్కు సత్య సాయి మేనేజింగ్ ట్రష్టి ఆర్జే రత్నాకర్, డిఎస్పి విజయ కుమార్, ఆర్డీవో సువర్ణ, తాసిల్దార్ అనుపమ, నీలకంఠా రెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ పుష్పగుచ్చాల అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్కు ఘనంగా వీడ్కోలు రాష్ట్ర గవర్నర్కు శనివారం మధ్యాహ్నం ప్రశాంతి నిలయంలోని సాయి శ్రీనివాస అతిథిగృహం నుండి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. వీడ్కోలు పలికిన వారిలో జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, అనంతపురం రేంజ్ డీఐజీ సీమోస్, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, జిల్లా ఎస్పీ రత్న, ఏఎస్పి శ్రీనివాసులు,ఆర్డిఓ సువర్ణ, మహేష్,ఎంఆర్ఓ అనుపమ ఉన్నారు.

## గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్ కు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే సింధూర

**పుట్టపర్తి, నవంబర్ 23, ప్రభాతవార్త :**
పుట్టపర్తిలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా 99వ జయంత్యుత్స వాలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ చేనేత శాఖ మంత్రి ఎస్ .సవిత, కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న, ఆర్డీవో సువర్ణ, పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,హిందూపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొర్లకుంట ఆంజనేయులు గవర్నర్ కు ఘన స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే పల్లె సింధూర మెమెంటో ను బహుకరించారు. వీరితో పాటు గవర్నర్ ను కలిసిన వారిలో కూటమి పార్టీ నాయకులు కొండమ రాజు, జ్యోతి ప్రసాద్, లాయర్ హరి కృష్ణ,సూరి, సామకోటీ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

## ఘనంగా భగవాన్ శ్రీ సత్యసాయి 99వ జయంత్యుత్సవాలు



బాబా మహాసమాధిపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్,ట్రస్ట్ సభ్యులు, మంత్రులు

**శ్రీసత్యసాయిజిల్లా, నవంబర్ 23, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఆధ్యాత్మికతను మానవీయత వైపు మళ్ళించి.. సామాజిక సేవలతో అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన భగవాన్ శ్రీ పుట్టపర్తి సత్యసాయి బాబా 99 వ జయంత్యుత్స వాలు శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లోని ప్రశాంతి నిలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సాయి కుల్వంత్ హాలులో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎం.ఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు బాబా సమాధిని దర్శించుకున్నారు. సాయి కుల్వంత్ హాలుతో పాటు సత్యసాయి విద్యాలయ భవనాలను, ప్రశాంతి నిలయంలోకి వెళ్లే రహదారులను రంగు రంగుల విద్యుత్ దీపాలు, రంగవల్లులతో అందంగా అలంకరించారు. శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవాదళ్ వాలంటీర్లు భక్తులకు వారం రోజులుగా అన్నదానం, ప్రసాద వితరణ మొదలైన సేవలు అందించారు.

## రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోంది

- అధికారులు కూడా రైతులకు మేలు చేసేలా పనిచేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



హాజరైన అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, నవంబర్ 23 ప్రభాతవార్త**
అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ పరిధిలోని కొత్తరైల్వే స్టేషన్ నిర్మాణానికి 17.97 ఎకరాల విస్తీర్ణంకు సంబంధించి డిఎల్ఎన్‌సి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ సర్వే నెంబర్ 177లో విస్తీర్ణం 9.92 ఎకరాలు, సర్వేనెంబర్ 178లో విస్తీర్ణం 8.05 ఎకరాలు మొత్తం 17.89 ఎకరాల కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణ కోసం 17 మంది రైతులు రైల్వే లైన్‌కు సంబంధించి వారి నుండి ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎకరాకు 6.25 లక్షల వరకు వస్తుందని కానీ రైతులు బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు 30 నుండి 33 లక్షల వరకు వుందని అదేవిధంగా ఇవ్వాలని కోరుతున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతులకు మేలు చేసే విధంగా పనిచేస్తోందని ఇందులో భాగంగా అధికారులుకూడా పనిచేస్తారన్నారు. అదేవిధంగా బెలుగుప్ప మండలం నర్సాపురం గ్రామ పరిధిలో గడిచిన ఒక సంవత్సర కాలంలో భూమి క్రయ, విక్రయాలపై పునఃపరిశీలన చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వాల్యుయేషన్ కంటే ఎక్కువగా రిజిస్టర్ చేసుకున్నటువంటి ఆధారాలతో కూడిన నివేదికలు సమర్పించాలని గడిచిన సంవత్సర కాలంలో క్రయవిక్రయాలు నర్సాపురం గ్రామ పరిధిలో జరుపుకుండా వుంటే సమీప చుట్టుపక్కల గ్రామాల్లో క్రయ విక్రయాలు జరిపిన నివేదికలైనా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి గ్రామస్థాయిలో విఆర్ఓ, తహశీల్దార్, మండల సబ్ రిజిస్ట్రార్ క్రయ విక్రయాలపై ఆరా తీసి పరిశీలించి నివేదికలు జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి పంపించాలని జిల్లా రిజిస్టర్ ఆ నివేదికలను డిఎల్ఎన్‌సికి నివేదిక సమర్పించడం జరుగుతుందని వారు సమర్పించిన నివేదికను డిఎల్ఎన్‌సి సమావేశంలో ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు వాటిని ఆమోదించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత్‌బాబు, రైల్వే శాఖ ఇఇ జగదీష్‌సాయి, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డిడి నరసింహారావు, తహశీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చడమే మా ప్రభుత్వ ధ్యేయం

- ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి కొండంత అండ.
- ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.19 లక్షల రూపాయలను మంత్రి సత్యకుమార్,ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె చేతుల మీదుగా 13 మంది నియోజకవర్గ లబ్ధిదారులకు చెక్కులు అందజేత.

**సత్యసాయి జిల్లా వైద్యము నవంబర్ 23 ప్రభాతవార్త:**
రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని అన్నారు.పుట్టపర్తి లోని స్థానిక ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం పుట్టపర్తి నియోజకవర్గం లోని 13 మంది లబ్ధిదారులకు సుమారు 19 లక్షల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,కష్టాల్లో ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక ఆర్థిక భరోసాను ఇచ్చారని పేర్కొన్నారు.

ఆరోగ్య వంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం సాధ్యమన్నారు. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబ సభ్యులందరూ ఆనందంగా ఉంటారని కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలైతే కుటుంబం మొత్తం చెందుతుందన్నారు. పేదలకు కష్టం వచ్చినప్పుడు వారికి అన్నీ విధాలుగా ఇంటి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని గుర్తు చేశారు. అనారోగ్యానికి గురై కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆసుపత్రి ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను ప్రస్తుతం నెరవేర్చారని తెలిపారు .మనిషి సంపూర్ణంగా కోలుకోవాలని వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలన్నదే ఈ కూటమి ప్రభుత్వం ఆశయం అన్నారు. అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక భరోసాను ఇస్తున్నారని తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి నియోజకవర్గం లోని బుక్కపట్నం చెందిన చీకటి నరేష్ కు 4,00,165 రూపాయలు, వెంగళమ్మ చెరువు చెందిన ఈడిగ నీళ్ల రమణకు రూ.5 లక్షల 13 వేల 134లు, పాముదుర్తి కాలసముద్రం రామక్క 18,000 ఓడి చెరువు మండలం కొండకమార్లకు చెందిన అల్లాబకేష్ 2,17 ,500 లు, ఓడి చెరువు దేరంగుల ఆదర్శ్ 45000 కొండకమర్ల కొలిమి ముంతాజ్ వలీ ఖాన్ 2,24,100 లు, పెగోళ్ల శంకరమ్మ రూ.1,53,930 లు మంత్రి , ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

## ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్

### - డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో చెక్‌పోస్టుల సమీపంలో దాడి కర్ణాటక మద్యం స్వాధీనం

**కంబదూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

కంబదూరులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ శనివారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం వారు ఆదేశాలు ఇవ్వడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, మొబైల్ పార్టీ ఇన్స్‌పెక్టర్లకు డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడంతో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు చెక్‌పోస్ట్ సమీపంలో దాడులు జరుపగా అక్రమంగా తరలిస్తున్న 420 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మొబైల్ పార్టీ అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి - తహశీల్దార్

**కంబదూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం కంబదూరు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ బాలకిషన్ అండేపల్లి గ్రామంలోని 239, 240 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన ఫ్వారం 6, 7, 8ల గూర్చి బూత్ స్థాయి అధికారులకు వివరించారు. ప్రజల వద్ద నుంచి పలు దరఖాస్తుల స్వీకరించి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డుకు ఇరువైపులా ముల్ల కంపల తొలగింపు

**బ్రహ్మసముద్రం, నవంబర్ 23 ప్రభాతవార్త**


ముళ్లకంపలను తొలగింప చేస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం ఎరపదొడ్డి గ్రామం మధ్య చెరువు కట్టపైన దారి పొడవునా ఉన్న కంప చెట్లు పూర్తిగా దారి కంపచెట్లతో దారి మూసుకుపోవడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు స్కూల్ పిల్లలు, రైతులు, ఇది గమనించిన వైఎస్‌ఆర్‌సిపి నాయకులు యు.రెడ్డప్ప, యు.మోహన్, యునరసింహ సొంత ఖర్చులతో కంప చెట్లు తొలగించడం జరిగింది. రైతులు జి.మాలింగ బట్టల స్వామి ప్రజలు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

**బ్రహ్మసముద్రం, నవంబర్ 23 ప్రభాతవార్త**


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలం సంతేకొండాపురంలో శనివారం మరు గుదొడ్డి వినియోగంపై పదిరోజుల ప్రత్యేక క్యాంపులో భాగంగా అధికారులు, స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డిని పరిశీలించి దాని వినియోగంపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచు వనిత మల్లికార్జున పంచాయితీ కార్యదర్శి అనిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లలిత సచివాలయ సిబ్బంది సంధ్య, వినోదమ్మ, ప్రియాంక ముజాహిద్, అభిషేక్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఓబులేసు, తేదేపా నాయకులు వార్డు సభ్యులు లక్ష్మన్న, నరసింహులు, డీలర్ చెన్న మల్ల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మంపల్లి విత్తన వేరుశనగ పంపిణీ

**శెట్టూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**


విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని లక్ష్మంపల్లి గ్రామపంచాయితీ గ్రామ సచివాలయంలో రబి సీజన్, రైతులకు విత్తన వేరుశనక్కాయలను మాజీ ఎంపిపి చిత్తప్ప ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపిపి చిత్తప్ప కోరారు. విత్తన వేరుశనగ కాయలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఏ మంజునాథ్, మాజీ ఎంపిపి చిత్తప్ప, విహెచ్ఎ మంజునాథ్, మాజీ సర్పంచు మరిస్వామి,ఖాదర్‌వలి, డీలర్లు గౌని బొజ్జప్ప, వీరభద్ర, వీరాంజినేయులు భూస్వామి గురుస్వామి, నల్లప్ప రైతులు పాల్గొన్నారు.

## కర్ణాటక అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**కుందుర్పి, నవంబర్ 23 ప్రభాతవార్త**


వ్యక్తిని అరెస్టు చేసిన దృశ్యం

గ్రామచివరన కర్ణాటకలోని లింగం పల్లి రగామంలో మందలపల్లికి అక్రమంగా తరలిస్తున్న మద్యం అక్రమ నిర్వాహకుడు పైన పోలీసులు దాడి చేసి నింధితున్ని అరెస్టు చేశారు. నిందితుడు మందలపల్లి బోయ గంగాధర్ నుంచి ఒక ద్విచక్ర వాహనమును మూడు కేసుల కర్ణాటక అక్రమ మద్యాన్ని సీజ్ చేశారు. నింధితుడుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని స్థానిక ఎస్సై నగేష్ విలేకరులకు సమాచారం తెలిపారు. నింధితుడు నుంచి టెట్రాపాకెట్లు, లిక్కర్ సుమారు పదివేల ఎనిమిది వందల రూపాయలు విలువచేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో మరెక్కడైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించి విక్రయించినా అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ ఘాటుగా హెచ్చరించారు. అలాంటి వారిపైన స్థానిక పోలీసులకు సమాచారం చేరవేయాలని కోరారు.

## దుమ్ముతో ప్రయాణికుల ఇబ్బందులు


రోడ్డుపై లేస్తున్న దుమ్ము


జాతీయ రహదారి పై మట్టి నిలువలతో వాహన దారులకు ఇబ్బంది

**డి.హీరేహాళ్, నవంబర్ 23 ప్రభాతవార్త:** బళ్లారి నుండి బెంగళూరు జాతీయ ప్రధాన రహదారిపై దుమ్ములేస్తుండ టంతో ప్రయాణికులు, ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు, ప్రజలు వాపోతున్నారు. డి.హీరేహాళ్ మండల కేంద్రంలో జాతీయ రహదారి ప్లైఓబర్ నిర్మాణం పనులు జరుగుతుండటంతో రోడ్డుకు నీళ్ల వేయాల్సిన కాంట్రాక్టర్ విశ్మరించడం వల్లే సమస్య ఉత్పన్నమైందని, దుమ్ములేస్తుండటంతో ఎదురెదురు వాహనాలు కనబడటం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డ పనులు జరుగుతున్న సమయంలో రోజుకు ఆరు సార్లు దుమ్ము రేగకుండా రోడ్డుపై నీళ్ల వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిబ్బందనలను ఉల్లంగించి దుమ్ము లేసేందుకు కారణమైయాడని స్థానికులు విమర్శిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు, దుమ్ము రేపుతున్న విషయం తదితర ఇబ్బందుల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మట్టి నిలువలు రోడ్డుకు ఇరువైపులా ఉండటంతో వాహనాల ప్రయాణానికి ఇబ్బంది కరంగా ఉందని, మట్టి నిల్వలను తొలగించి ప్రయాణానికి సౌకర్యం కల్పించాలని వాహన చోదకులు తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న నివాసం ఉన్న ఇళ్లలోకి దుమ్ము, దూళి పోతుండటంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు వాపోతున్నారు.

## ఘనంగా శ్రీ సత్యసాయి జయంతి వేడుకలు

**కళ్యాణదుర్గం రూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త:**


శ్రీ సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భగవాన్ శ్రీ సత్యసాయి 99వ జయంతి వేడుకలు పట్టణంలో శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు బట్రాజ్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వ ర్యంలో జరుపబ డింది. ముందుగా శ్రీ సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి భగవాన్ సత్యసాయి సేవలను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్లు పంపిణీ చేయడం కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల లకాడమిక్ డైరెక్టర్ కె.నరసింహాచారి మరియు ప్రధాన ఉపాధ్యాయులు ఎమ్. వన్యూరు స్వామి ముఖ్యఅథిదులుగా బట్రాజ్ హెల్పింగ్‌హాండ్స్ అధ్యక్షుడు శ్రీ ముంగర శ్రీనివాస రాజు మాజీ అధ్యక్షులు శ్రీ నారాయణ రాజు, మాజీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి సభ్యులు శ్రీ శ్యాంసుందర్ రాజు పాల్గొనడం జరిగింది.

## పరిసాల పరిశుభత్రతోనే వ్యాధులకు రక్షణ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**గుమ్మఘట్ట, నవంబర్ 23 ప్రభాతవార్త:**

పరిసరాలు పరిశుభ్ర ముగా ఉంచుకోవడము వల్ల ప్రాణాంతక డెంగ్యూ, మలేరియా వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని వైద్యాధికారి డా. రమైష్, మలేరియా సబ్ యునిట్ ఆఫీసర్ నాగేంద్ర ప్రసాద్ తెలియజేశారు గుమ్మఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెలోడు గ్రామంలో దోమల కాటు వల్ల వచ్చే జబ్బులు వాటి నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. దోమల లార్వా నివారణ కు నిల్వ నీటి లో అబేట్ మందును పిచికారి మరియు ఇళ్ళలో పైరిత్రమ్ ను పిచికారి చేయించారు. నీటి తొట్టిలో లార్వాను గుర్తించి వాటిని పారబోయిం చారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు అవగాహన కల్పిస్తూ దోమలు వారముకంటే ఎక్కువరోజులు నిల్వఉన్న నీటిలోనే తమగుడ్లను పెడతాయని, ముఖ్యంగా డెంగ్యూను కల్గించే దోమ మంచి నీటిలోనే పుడుతుందని, కావుల మంచినీరు నిల్వ ఉన్న తొట్టెలు, డ్రమ్ములు వంటి వాటిలోని నీటిని వారానికి ఒక సారి పారబోసి పొడి బట్టతో తుడిచి డ్రై చేసుకోవాలని దీని వల్ల దోమలు పుట్టకుండా చేయవచ్చని సూచించారు. డెంగ్యూ ను కల్గించే దోమ పగటి పూట కుడుతుందని, కావున పిల్లలకు పగటిపూట కుడా శరీరం పూర్తిగా కవర్ అయ్యేవిధంగా దుస్తులు వేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో వాడి పడేసిన కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ గ్లాసులు, టైర్లు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని తలిపారు. జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రం నకు వెళ్ళి చూపించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మంజుల, సూర్యనారాయణ మరియు ఆశా కార్యాకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై శ్రీ చైతన్య విద్యార్థుల అవగాహన ర్యాలీ



ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని విద్యార్థులు మరియు పోలీసులు

**కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏజీఎం సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై పాఠశాల నుండి పోలీస్ స్టేషన్ వరకు యముడు మరిము చిత్రగుప్తుడు పాత్రలు ధరించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించి, పోలీస్‌స్టేషన్ దగ్గర సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులచే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వలన జరిగే పరిణామాలపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్ మరియు డిన్ తిప్పారెడ్డి, ఇన్‌చార్జ్ లీలావతి, హేమలత, పిఈటి అశోక్, హరి యమున పాత్రధారి, తెలుగు ఉపాధ్యాయుడు మారెప్ప, డాన్స్ మాస్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయునీ ఉపాద్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలకృష్ణకు ఘన స్వాగతం

**హిందూపురం నవంబర్ 23 ప్రభాతవార్త**


బాలయ్య కు స్వాగతం పలుకుతున్న మాజీ చైర్మన్ అనిల్

కొన్ని నెలలుగా షూటింగ్ లతో బిజీ బిజీగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ఒక వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు శనివారం మధ్యాహ్నం ఇక్కడికి వచ్చారు. నియోజకవర్గ సరిహద్దు కోడికొండ చెక్పోస్ట్ వద్ద, హిందూపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు పుష్ప గుచ్చాలు అందించి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ జె వి అనిల్ కుమార్, కాబోయే మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ కుమార్, కౌన్సిలర్ రాఘవేంద్ర, డిసి రఘునాథ్ తదితరులు ఉన్నారు.

## హనుమాన్ విగ్రహానికి రూ. 5 లక్షలు విరాళం

**హిందూపురం టౌన్ నవంబర్ 23 ప్రభాతవార్త**


రూ. 5 లక్షలు అందిస్తున్న వైసి కార్తీక్

శ్రీ సత్య సాయి జిల్లాలోని అత్యంత ఎత్తైన ఏకశిల శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణం శరవేగంగా జరుగుతున్న క్రమంలో పట్టణ ప్రముఖులు వైసీ చంద్రశేఖర్ కుమారుడు, వ్యాపారవేత్త వైసి కార్తీక్ సొంతంగా రూ. 5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు సూగూరు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం మైదానంలో విగ్రహ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో శనివారం ట్రస్ట్ కమిటీ సభ్యులు రాయల్ గోపాల్ తదితరులకు దాత ఈ విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో రమేష్ బాబు, కిషోర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి ప్రాకారోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీ వెంకటేశ్వర స్వామి


పల్లకి ఉత్సవ దృశ్యం

**హిందూపురం టౌన్ నవంబర్ 23 ప్రభాతవార్త**

కార్తీక మాసం 4 వ శనివారం సందర్భంగా పట్టణంలోని శ్రీ పేట వెంకటరమణ స్వామి దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారి మూలవిరాట్ కు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. తదుపరి శ్రీదేవి భూదేవిలతో శ్రీవారి ఉత్సవ మూర్తులను పల్లకిపై ప్రతిష్టించి గోవింద నామస్మరణల మధ్య ప్రాకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో భగీరథి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుకలు

**బెలుగుప్ప, నవంబర్ 23 ప్రభాతవార్త**


అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

మండలకేంద్రంలో స్థానిక సత్యసాయి బాబా దేవాలయంలో సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తాదులందరికీ వృద్దులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరువు ఉపాధి పనులను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్ ఖలీమ్

**బెలుగుప్ప, నవంబర్ 23 ప్రభాతవార్త**


పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ ఖలీమ్

మండలంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఖలీమ్ ఆకస్మికంగా ఉపాధి పనులను, పనిచేసే స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులను చేసే కూలీలను పెంచాలని, కూలీలు చేసిన పనికి వేతనం 300లకు తగ్గకుండా చూడాలని టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అందులో భాగంగా మండలంలో పని చేస్తున్న కూలీల సంఖ్య పెంచుతూ ఏరోజుకా రోజు మస్టర్‌ను వేయాలని ఉపాధి మేట్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిబి శైలజా, ఎంపిఇఒ లక్ష్మినారాయణ, ఏపిఒ సూర్యప్రకాష్, మురళీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, అనంతపురం తెలుగుదేశం కార్యదర్శి మల్లికార్జున, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదును తనిఖీ చేసిన అధికారులు

**రాయదుర్గం, నవంబర్ 23 ప్రభాతవార్త:**


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు.

పట్టణంలోని రాధాకృష్ణ, గర్ల్స్ హైస్కూల్ తదితర పోలింగ్ కేంద్రల్లో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గం ఈఆర్ఒ(ఎఫ్ఏసి) యన్.వెంటేశ్వర్లు, తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి తదితరులు తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయాబూత్‌ల్లో ఓటరు నమోదు ఎలా జరుగుతున్నాయని వాటివివరాలను అడిగితెలుసుకున్నారు. 18,19సం వత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లు నమోదు పైన ప్రత్యేక దృష్టి పెట్టి ఓటరు నమోదు చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటితహసీల్దార్ మరియు సూపర్వైజర్ పాల్గొన్నారు.

## యూటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను విజయవంతం చేయండి

**డి.హీరేహాళ్, నవంబర్ 23 ప్రభాతవార్త:**



స్వర్ణోత్సవ మహాసభల్లో మాట్లాడుతున్న యూటిఎఫ్ నాయకులు.

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం యూటిఎఫ్ మండల స్వర్ణోత్సవ మహాసభలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య హాజర య్యారు. మండల స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ యూటిఎఫ్ సంఘం 1974లో ఆవిర్భవించి 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాసభలు పురస్కరించు కొని 2025జనవరి 5,6,7,8వ తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్న సందర్భంగా రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. యూటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసి వాటి పరిష్కారం కోసం యూటిఎఫ్ సంఘం శక్తి వంచన లేకుండా కృషిచేసిందన్నారు. ఈ సందర్భం గా యూటిఎఫ్ మండలశాఖ ఈ సమావేశంలలో పలు తీర్మానాలు ఆమోదిం చింది జిఎంఎంఎస్ 117రద్దుచేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, ఉన్నత పాఠశాలలో సమాంతరం మీడియంతో పాటు తెలుగు మీడియంని కొనసాగించాలని, హైస్కూల్స్ పనివేళ మార్పు తక్షణమే విరమించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లాకార్యదర్శులు హెచ్.రవి కుమార్ నాయక్, హనుమంతరెడ్డి, డి.హీరేహాళ్ స్కూల్ సీనియర్ పాఠశాల సహాయకులు నాగరాజు,మండలగౌరవాధ్యక్షులు టి.హనుమంతప్ప, అధ్యక్షు లు ఆర్.మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి జి.రామాంజినేయులు, కోశాధికారి వన్నూరప్ప, యూటిఎఫ్ సీనియర్‌నాయకులు వెంకోబ్రావ్, తెలుగు ఉపాధ్యా యులు ఉరుకుందప్ప, ఉపాధ్యాయులు మండల నాయకులు తిప్పేస్వామి, ఉపాధ్యాయులు శశిధర్, జిఎస్ హనుమంతప్ప, రమేష్, నాగరాజు, నాగలింగయ్య, పద్మనాభరావు, అరుణ్‌కుమార్, మహిళా ఉపాధ్యాయునిలు గాయత్రి, శాంతకుమారి, జ్యోతి, నాగవేణి, జయశ్రీ, హెచ్.సునీత, వి.సునీత, కేదారేశ్వరి, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

**యూటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎంపిక :** యూటిఎఫ్ మండల నూతన కార్యవర్గంను శనివారం ఎన్నుకున్నారు. యూటిఎఫ్ గౌరవాధ్యక్షులు గా టి.హనుమంతప్ప, అధ్యక్షులుగా ఆర్.మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా జి.రామాంజనేయులు, సహాధ్యక్షులుగా జిఎస్.హనుమంతప్ప, సహాధ్యక్షులుగా ఏ.కుసుమావతి, కోశాధికారిగా బి.వన్నూరప్ప, మండల కార్యదర్శులుగా పి.తిప్పేస్వామి, జిహెచ్.రామచంద్రప్ప, ఎం.శశిధర్, హెచ్‌జి.అరుణ్‌కుమార్, డి.హరినాథ్, జిఆర్.రమేష్, కెఆర్.సునీత, జిల్లా మహాసభ ప్రతినిధులుగా హెచ్.హుస్సేన్, లోకాభిరాముడు, ఆడిట్ కమిటి కన్వీనర్‌గా జె.వెంకోబ్రావ్, సభ్యులుగా జయసింహ, స్వామినాథరెడ్డి, ఉరుకుందప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

## కళ్యాణదుర్గం మున్సిపాలిటిలో ఓటరు నమోదు


ఓటరు నమోదు చేయించుకుంటున్న అధికారులు.

**కళ్యాణదుర్గం టౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త:** కళ్యాణదుర్గం మున్సి పాలిటి పరిధిలోని 56,57,58,59,60వ బూత్‌లల్లో శనివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఓటర్ల మార్పులు, చేర్పులు మరియు కొత్త ఓటర్లను నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ మురళి, డిష్ రమణ, డీలర్ శ్రీనివాసులు, ఎలక్షన్ అసిస్టెంట్ మరియు డిప్యూటి తహసీల్దార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొననున్న ప్రభుత్వ విప్ కాలవ

**డి.హీరేహాళ్, నవంబర్ 23 ప్రభాతవార్త:**

డి.హీరేహాళ్ మండల పరిధిలోని పులకుర్తి గ్రామంలలో నేడు ఉదయం 9గంటలకు జరుగబోయే శ్రీ భక్త కనకధాసు జయంతి వేడుకల్లో రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొనున్నట్లు సర్పంచ్ కురుబ దొణప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జయంత్సోవాలకు ఎమ్మెల్యే కాలవతో పాటు జనసేన పార్టీ నియోజకవర్గం అధ్యక్షులు మంజునాథ్‌గౌడ్, డి.హీరేహాళ్ కన్వీనర్ యూ.హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి, మాకాసి వెంకటేశులు, తదితర పెద్దలు విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## కార్తీక మాసం చివరి సోమవారం రోజున అక్కమాంబ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం

**కళ్యాణదుర్గం రూరల్ నవంబర్ 23 ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ అక్కమాంబ ఆలయం వద్ద గత నాలుగు సంవత్సరాల నుండి కార్తీక మాసం చివరి సోమవారం మాల ధారణ వేసిన స్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా కార్తీక మాసం చివరి సోమవారం రోజున భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించబడు తుందని మాలధారణ స్వాములు ఈ కార్యక్రమానికి ఎవరైనా దాతలు ఉంటే ముందుకు రావాలని స్వాములవారు తెలిపారు అన్నదాన కార్యక్రమానికి అక్కమాంబ ఆలయం ఆవరణంలో భారీ ఎత్తున ఏర్పాటు కూడా చేయడం జరుగుతుందని అక్క మామ ఆలయ కమిటీ సభ్యులు స్వాములు వారు తెలిపారు అన్నదాన కార్యక్రమంలో దాతలు ముందుకొచ్చి మరింత భారీ ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని ప్రతి ఒక్క స్వాములకు మరియు అక్కమాంబ భక్తులకు పిలుపునిచ్చారు.

## భూమిరెవెన్యూ సమస్యలపై గ్రీవెన్స్‌డే

**కళ్యాణదుర్గం,నవంబర్ 23 ప్రభాతవార్త:**


జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

పట్టణంలోని ఆర్ డి టి ఎకాలజీ సెంటర్లో ఈనెల 25వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన ఉదయం 10 గంటలనుండి భూమి రెవెన్యూ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి వసంత బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చిలమత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

చిలమత్తూరు మండలం 33/11 కెవి మొరంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పరిశ్రమలకు, కొడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్స్, వినియోగదారులకు ఆదివారం ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అసిస్టెంట్ ఇంజనీర్ జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీశైల మల్లికార్జున స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే దగ్గుపాటి

- రాష్ట్రం, అర్బన్ నియోజకవర్గం బాగుండాలని పూజలు



శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే దృశ్యం

**అనంతపురం అర్బన్, నవంబర్ 23 ప్రభాతవార్త**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శ్రీశైల భ్రమరాంబికాదేవి, మల్లికార్జున వారిని దర్శించుకున్నారు. కార్తిక మాసం నేపథ్యంలో ఆయన తన సన్నిహితులతో కలసి శ్రీశైల క్షేత్రానికి వెళ్లారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే దగ్గుపాటి అధికారులు స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామిని, భ్రమరాంఆబికాదేవిని దర్శించుకున్నారు. ఆలయంలోనే చాలా సేపు గడిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మరింత పురోభివృద్ధి సాధించాలని, అర్బన్ నియోజకవర్గ ప్రజలకు అంతా మంచి జరగాలని పూజలు చేసినట్లు వివరించారు. కార్తిక మాసంలో పరమ శివున్ని దర్శించుకోవడం ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

## నవంబర్ 26న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

**కూడేరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

స్థానిక మండల కేంద్రంలో సిపిఎం పార్టీ నాయకులు కరపత్రాలు శనివారం విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టేది రైతులు, సర్వసంపదలు సృష్టించేది కార్మికులు ఐతే బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రతరం చేసిందని ముఖ్యంగా దేశ రైతాంగాన్ని సర్వనాశనం చేయడానికి మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చినప్పుడు రైతాంగ ఉద్యమం చేపట్టడం వలన, ఉద్యమ ఒత్తిడికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతన్నలను క్షమాపణ కరి మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తేవాలనుకున్నాడు, అయితే హామీ ఇచ్చిన రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ప్రధానమంత్రి నోరు మెదపడం లేదు, ముఖ్యంగా రైతులు పండించిన అన్ని పంటలకు కనీసం మద్దతు ధర, విద్యుత్ సవరణ బిల్లు 2022న వాటిని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఖరీం, రైతు సంఘం మండల నాయకులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్‌కు ఎంపికైన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బి.అభిషేక్‌నాయక్, పొట్టేటి యల్లమంద, భవ్య, చెన్నకేశవరెడ్డి, గీత ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ (యువసంఘం ఫేజ్-5) కార్యక్రమానికి ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ తెలిపారు. విద్యార్థులు ప్రయోగలోని ఐఐటి అలహాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ వారు నిర్వహిస్తున్నారు. ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్‌లో విద్యార్థులు పర్యటన, సాంప్రదాయాలు, ప్రగతి, పరస్పర మానవ సంబంధాలు పెంచుకొనుట, సాంకేతికత లాంటి అంశాలను పెంపొందించుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. యువ సంఘం వల్ల దేశ వ్యాప్తంగా యువత పరస్పర రాష్ట్రాలతో సంబంధాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం భారత ప్రభుత్వం రూపొందించడం జరిగింది. వివిధ రాష్ట్రాల్లో జీవితం, సంస్కృతి, సాంకేతిక విషయాల పరిజ్ఞానం వల్ల విద్యార్థుల్లో విభిన్న కోణాలను ఆవిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా 2 సార్లు ఈ అవకాశం కల్పిస్తున్నారని కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ హె.విష్ణుప్రియ పేర్కొన్నారు. ఒకే కళాశాల నుంచి 5 మంది విద్యార్థుల ఎంపిక పట్ల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డి.నాగలింగరెడ్డి విద్యార్థులను అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు పి.రామకృష్ణ, కె.సుధాకర్, లైబ్రేరియన్ కేశలు అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుకెళ్లాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మశ్రీ ఆకాంక్షించారు.

## షాపింగ్ కాంప్లెక్స్ కళ్యాణ మండంపై ఎండోమెంట్ వారికి ఎలాంటి హక్కులు లేవు

- భావసార క్షత్రీయుల (రంగరాజులు) వెల్లడి

**పామిడి, నవంబర్ 23 ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీభావసార క్షత్రియ కళ్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్ పై ఎండోమెంట్ వారికి ఎలాంటి హక్కులు లేవని పెద్దల స్వయం కృషి చందాలు విరాళాలతో మేము స్వతహాగా నిర్మించుకున్నామని భావసార క్షత్రీయులు (రంగరాజులు) జగని రవికుమార్, శ్రీనివాసరావు, జోజోడే కుమార్ శనివారం ప్రభాతవార్త ద్వారా తెలియజేశ్యారు. భావసార క్షత్రీయ పేద మధ్య తరగతి ప్రజల గృహాల్లో జరుగు శుభ కార్యక్రమాల కోసం భావసార భవన్ (కళ్యాణ మండపం) నిర్మించాలని 1971లో పెద్దలు తీర్మానించి చందాలు పోగు చేసుకుని వివరాలను సేకరించి నిర్మించడం జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో కళ్యాణ మండపంకు ఆనుకుని షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి వచ్చిన ఆదాయంతో భావసార క్షత్రియ ప్రజలకు సంబంధించి శ్మశాన వాటిక దశదిన కార్యక్రమం బృందావనం ప్రతిఏటా జరుగుచున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. భావసార క్షత్రియ కళ్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్ యావత్ భావసార క్షత్రీయ సమాజానికి సంబంధించినవి అని ఏ ఒక్కరికీ సొంతం కావని వారు వెల్లడించారు.

## రేషన్ డీలర్ల సంఘం మండల్ల అధ్యక్షుడిగా ఎంఎం హళ్లి రాజు ఏకగ్రీవ ఎన్నిక

**కూడేరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

కూడేరు మండల చౌక ధాన్యం డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా ఎంఎం హళ్లి పూజారి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే ఉపాధ్యక్షుడుగా అంతరగంగ బోయచంద్రన్నను ఎన్నుకోవడం జరిగింది. శనివారం రోజు స్థానిక తహశీల్దారు క ఆర్యాలయంలో సిఎస్‌డిటి లక్ష్మిదేవి డీలర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం డీలర్ల సంఘం మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పలు గ్రామాల డీలర్లను కమిటీ మెంబర్లను ఎంపిక చేశారు. వారికి టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ప్రతినెల జరిగే సమావేశాలకు అందరు డీలర్లు హాజరు కావాలని, డీలర్ల సమస్యలు ఏవైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## దేవాదాయ శాఖ చర్యలను అడ్డుకున్న భావసార క్షత్రీయులు

**పామిడి, నవంబర్ 23 ప్రభాతవార్త**



దేవాదాయ శాఖ చర్యలను అడ్డుకుంటున్న భావసార క్షత్రీయులు

భావసార క్ష త్రీయ కళ్యాణ మండపం కాంప్లెక్స్ గదులను దేవాదాయ శాఖ స్వాధీనపరుచుకునే చర్యలను శనివారం భావసార క్షత్రీయ కులస్తులు అడ్డుకున్నారు. మా ఆస్థులను ఎలాంటి ఉత్తర్వులు లేకుండా కనీసం నోటీసులను ఇవ్వకుండానే మా కుల ఆస్తుల స్వాధీనం చేసుకునేందుకు రావటం ఎంతవరకు సమంజసమని దేవాదాయ శాఖ అధికారులను భావసార క్షత్రీయులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు మేరకు ఇదివరకే నోటీసులు ఇచ్చామని దేవాదాయ శాఖ పరిధిలోని కాంప్లెక్స్ గదులను స్వాధీనపరుచుకునేందుకు అధికారం



ఈఓ కృష్ణయ్యతో చర్చిస్తున్న సిఐ యుగంధర్

మాకు ఉందని ఇలా అడ్డుకోవడం సబబు కాదని ఈఓ కృష్ణయ్య తెలియటం ఫలితాంగా ఆయన భావసార క్షత్రీయుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సిఐ యుగంధర్ ఈఓ కృష్ణయ్య భావసార క్షత్రీయులతో చర్చలు జరిపారు. కాంప్లెక్స్ గదులకు సంబంధించి మా పక్షాన హైకోర్టులో వాజ్యం నడుస్తున్న నేపథ్యంలో నెల రోజుల సమయం కావాలని బావసార క్షత్రీయులు కోరగా స్పందించిన ఈఓ కృష్ణయ్య డిసెంబర్ 6 వరకు గడువు ఇస్తున్నామని తదనంతరం మేము తీసుకోబోయే చర్యలకు అడ్డు తగిలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడం అందుకు భావసార క్ష త్రియులు సమ్మతించటంతో ఎట్టకేలకు అక్కడి సమస్య సద్దుమనిగింది

## అండర్ 23 జట్టు ఎంపిక

ఏ డి సీ ఏ ఇంచార్జ్ సెక్రటరీ వి. భీమలింగారెడ్డ్



అండర్ 23 జట్టు

**అనంతపురం క్లాక్ టవర్,నవంబర్ 23,ప్రభాతవర్త**

అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ గీ 23 పురుషుల బృందం 2024 నవంబర్ 24 నుండి 30 వరకు కడపలో జరగనున్న తిదితి గీ 23 (పురుషులు) ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తిదీదితి గీ 23 పురుషులకు ప్రాతినిధ్యం వహించడానికి క్రింది ఆటగాళ్లు ఎంపిక చేయబడ్డారు. లీరీ దత్తారెడ్డి జట్టుకు కెప్టెన్‌గా నామినేట్ అయ్యారు. లీరీ దత్తారెడ్డి కెప్టెన్ పి. అర్జున్ టెండూల్కర్ (గొట్లూరు), కెోచ్ వీరా రెడ్డి, బి. యోగానంద, ఎం. దీపక్, ఎన్. మనోజ్ కుమార్ (అనంతపురం) జి. మల్లికార్జున, ఎంకె లోహిత్ సాయి కిషోర్ (రాప్తాడు), టి. ప్రదీప్ రెడ్డి, బి. ప్రశాంత్ (నార్పల) , ఎం. జై కృష్ణ, కె. ప్రమోద్ (గుంతకల్), డి. ఖాదర్ వలి (ఆత్మకూర్) రోహిత్ రోషన్ (కళ్యాణదుర్గం), జె. లీలా సాయి (పెనుకొండ), టి. మహేందర్ రెడ్డి (తాడిపత్రి) జట్టు కోచ్ కె. నరేష్.

కూడేరు02 : రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం.హళ్లి రాజుకు స్వీట్లు తినిపిస్తున్న దృశ్యం

## ఘనంగా వడ్డే లక్ష్మి శ్రీనివాసులు కుమార్తె వడ్డే చైత్ర జన్మదిన వేడుకలు



వడ్డే చైత్రకు జన్మదిన శుభా కాంక్షలు తెలుపుతున్న తల్లిదండ్రులు వడ్డే లక్ష్మి శ్రీనివాసులు

**అనంతపురం రూరల్,నవంబర్22ప్రభాతవార్త**

ఉమ్మడి అనంత జిల్లా వైసిపి బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి,మహిళా నాయకురాలు వడ్డే లక్ష్మి శ్రీనివాసులు కుమార్తె వడ్డే చైత్ర జన్మదిన వేడుకలు కుటుంబం, స్నేహితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వడ్డే చైత్ర జన్మదిన వేడుకలను విద్యను అభ్యసించే పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి వారు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా కుమార్తె వడ్డే చైత్ర జన్మదిన వేడుకలను పాఠశాల విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది , విద్యార్థులు, వడ్డే చైత్ర విద్యలో రానిస్తు ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులు ఉన్నతమైన స్థానంలో నిలవాలని అలాగే నూరేళ్ల ఆరోగ్యంగాను, కుటుంబ సభ్యులతో సంతోషమంగా జీవించాలని ఆ దేవుని కోరుకోవడం జరిగిందన్నారు.

## టిడిపి ముఖ్య నేతలను కలిసిన ఆదినారాయణ



పార్టీ ముఖ్య నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆదినారాయణ

**శింగనమల, నవంబర్ 23 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మన వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ఎం.ఆదినారాయణ శనివారం టిడిపి ముఖ్య నేతలను కలిసి శాలువాతో సత్కరించి పూల బొకేను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసనాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీలో మరింత క్రియాశీలకంగా పని చేస్తానని నన్ను అన్ని విధాలాప్రోత్సహించి తనకు సహకారం అందించిన నాయకులందరికి మరొక్కసారి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అనంతపురం పార్లమెంట్ నాయీబ్రాహ్మణ సహకార కమిటీ సభ్యులు వెంకటప్ప, తాడిమర్రి సురేంద్ర, వెంకట్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## మహిళలను కించపరిచేలా మంత్రి సవిత వ్యాఖ్యలు

- వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

**అనంతపురం సిటీ, నవంబర్ 23 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని మహిళలను కించ పరిచేలా రాష్ట్ర మంత్రి సవిత మండలి సాక్షిగా మాట్లాడటం సిగ్గు చేటని వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో వైసీపీ మహిళా నాయకురాళ్లతో కలిసి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి సవిత మండలిలో మహిళలు ప్రభుత్వం ద్వారా అందిన డబ్బుతో మత్తు పదార్థాలకు, గంజాయికి అలవాటు పడ్డారని మాట్లాడటం మహిళలందరినీ అవమానించడమే అన్నారు. ఒక మహిళ అయి వుండి సాటి మహిళలను కించ పరిచేలా ఆమె ఏ విధంగా మాట్లాడుతారని ప్రశ్నించారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను మహిళల ఖాతాల్లోకే నేరుగా జమా చేసి మహిళా సంక్షేమం, అభివృద్ధి పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల నమ్మకంతో వారి అకౌంట్లలో సంక్షేమ పథకాల ద్వారా జమా చేసిన డబ్బుతో మహిళలంతా కుటుంబ అవసరాలు, వారి ఆర్థిక అభివృద్ధికి వినియోగించుకున్నారని గుర్తు చేశారు. మంత్రి సవిత మహిళల వద్దకు వెళ్లి అడిగితే తమ ఖాతాల్లో జమా అయిన డబ్బులు ఏ విధంగా ఖర్చు చేసింది తాము ఏ విధంగా అభజవృద్ధి చేసింది వివరిస్తారన్నారు. అవగాహన లేకుండా మహిళలను కించ పరిచేలా మాట్లాడిన మంత్రి సవిత, మహజిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం వైసీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అక్కసుతోనే రాష్ట్రంలోని మహిళలను మాట్లాడారన్నారు. కూటమి ప్రభుత్వం ఏ ర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కూటమి నేతలు సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించి కేవలం వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆమె విమర్శించారు. ఇప్పటికైనా దిగజారుడు మాటలను ఉన్నతస్థాయిలో ఉన్న మంత్రి సవిత మానుకోవాలని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేశాయి భారతిరెడ్డి, మహిళ నేతలు క్రమతాజ్, భారతి, శోభారాణి, అంజలి, ప్రసన్నలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యటించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి



బిఎల్ఓలను ఓటర్ల జాబితా గురించి అడిగి తెలుసుకుంటున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

**కూడేరు, నవంబర్ 23 ప్రభాతవార్త**

మండల పరిధిలోని జల్లిపల్లి,కూడేరు, ఉరవకొండ గ్రామాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనందరావు, డిప్యూటీ తహశీల్దార్ సూర్యప్రతాప్ యాదవ్‌తో కలిసి శనివారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయిలోని ఓటర్ ఐడిక ఆర్డ్, ఓటర్ల జాబితాలో సవరణలు, చిరునామా మార్పులు లాంటివి, ఏవైనా చిన్న పొరపాట్లు ఉంటే వాటిని సవరణ చేయడం, ఓటర్ల నమోదు తదితర అంశాలపై స్థానిక బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణను బిఎల్‌ఓలు దగ్గర ఉండి నమోదు చేయించే కార్యక్రమాన్ని చేపట్టాలని వారికి సూచించారు. అలాగే కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్‌సెంటర్ పరిశీలించారు. ఆధార్ సెంటర్ యొక్క పనితీరును డిజిటల్ ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ లక్ష్మన్న, కంప్యూటర్ ఆపరేటర్‌నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఏడుగురు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బండారు శ్రావణిశ్రీ



**శింగనమల, నవంబర్ 23 ప్రభాతవార్త**

నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్ద ఆటోను బస్సు ఢీ కొట్టిన సంఘటనలో శనివారం ఏడుగురు మృతిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు అధికారులు బాధజతులకు అండగా నిలిచి వారికి సరైన చికిత్స అందేలా చూడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వారు తెలిపారు.

## రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

- ఘటనపై జిల్లా ఎస్పీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు

**గార్లదిన్నె, నవంబర్ 23 ప్రభాత వార్త**

గార్లదిన్నె మండలం తలగాసిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. ఈ ప్రమాద ఘటనలో మొత్తం నలుగురు చనిపోయారు. కూలి పనుల కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో కూలీలతో వెళ్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి ఎస్పీ చేరుకొని అక్కడ ఘటన జరిగిన తీరును మరియు అందుకు కారణాలను నిశితంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీతో పాటు అనంతపురం రూరల్ డి.ఎస్.పి టి.వెంకటేశులు,సీఐ కౌలుట్లయ్య,ఎస్సై గౌస్ యండి భాష, ఇతర పోలీసు అధికారులు వెళ్లారు.

## నేడు కావేటి ఆసుపత్రిలో వెరికోసావెయిన్స్ ఉచిత కన్సల్టేషన్

**అనంతపురం ఓల్డ్ టౌన్ నవంబర్ 23 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని రాంనగర్ లో ఉన్న కావేటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వెరికోస వేయిన్స్ నిర్ధార ణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. శనివారం ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం కావేటి ఆసుపత్రిలో ఉచిత కన్సల్టేషన్ నిర్వహిస్తున్నామని ఈ కన్సల్టేషన్ కు రోగులు వచ్చి సందేహాలనువృత్తి చేసుకోవచ్చని తెలిపారు. వెరీ కోజ వీయన్స్ వల్ల ఎక్కువమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. వీటిని తొలి దశలనే గుర్తించి వైద్యం అందించని ఎడల ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది తెలిపారు. రక్త ప్రసరణ సాఫీగా సాగక గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయని వెరి కోస వీయిన్స్ లక్షణాలు కనపడిన వెంటనే డాక్టర్ను సంప్రదించాలని సూచించారు. రోగ తీవ్రత లక్షణాలు అధికంగా ఉన్న రోగులకు డాక్టర్ సలహాతో ఉచితంగా కలర్ డాప్లర్ స్క్రీనింగ్ నిర్వహించి వైద్యం అందిస్తామని తెలిపారు. లేజర్ చికిత్స ద్వారా వెరికోజ వీయిన్స్ ను పూర్తిగా నయం చేయవచ్చు అని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలియజేశారు. అపాయింట్మెంట్ కొరకు 7382018789,9632212204 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## గ్రామ ప్రజలు ఆనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవమే మా లక్ష్యం

- పంచాయితీ కార్యదర్శి యు.హిదయతుల్లా



రుద్రంపేట వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్న కార్యదర్శి యు.హిదయతుల్లా

**అనంతపురం రూరల్,నవంబర్23ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామంలోని ప్రజలు ఎవరు ఆనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవమే తమ ముఖ్య లక్ష్యమని పంచాయితీ కార్యదర్శి యు.హిదయతుల్లా తెలిపారు. అనంత రూరల్ మండలంలోని రుద్రంపేట పంచాయితీలో శనివారం పంచాయితీ కార్యదర్శి యు.హిదయతుల్లా పారిశుద్ధ్య కార్మికులతో పాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్ గ్రామంలో నివసించే ప్రజలు ఎవరు ఆనారోగ్యాల బారిన పడకుండా తగు చర్యలు తీసుకుని ప్రతి రోజు పంచాయితీ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించడంతో ఆయన ఆదేశాల మేరకు రుద్రంపేట పంచాయితీలో నివాసించే ప్రజలు ఆనారోగ్యం బారిన పడకుండా వారి ఆరోగ్యలను రక్షించడమే తమ బాధ్యత అనే సంకల్పంతో గ్రామ ప్రజలకు రోగాలు సోకకుండా వాటీ నివారణ కోసం పంచాయితీలో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించి కాలువలపైన బ్లీచింగ్ పౌడర్ వేయడంతో పాటు వీధులు మొత్తం శానిటేషన్ చేయించి ఫాగింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా గ్రామ ప్రజలు ఆరోగ్యశాఖ సూచనలు, సలహాలను పాటించి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రతలు తీసుకుని ఆరోగ్యలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

టిడిపి రూరల్ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ



సిండికేట్ నగర్‌లో సిసి రోడ్డు ఏర్పాటుకు పన్నులు చేపడుతున్న దృశ్యం

**అనంతపురం రూరల్,నవంబర్23ప్రభాతవార్త**

రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని టిడిపి రూరల్ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పేర్కొన్నారు. అనంత రూరల్ మండలం రాచానపల్లి గ్రామ పంచాయితీ సిండికేట్‌నగర్‌లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహయ సహకారాలతో ఎన్ఆర్‌జీఎస్ నిధుల కింద మంజూరైన సిసి రోడ్డు పనులను ఆయన స్థానిక టిడిపి నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ జింకా సూర్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాల అభివద్ధిని గాలికి వదిలేసి గ్రామాలను ఆదోగతపాలుచేయడం జరిగిందని కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పరిటాల సునీత సిఎం చంద్రబాబు నాయుడుతోను,డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌తోను, అధికారులతో మాట్లాడి కోట్ల రూపాయాలు నిధులు తీసుకవచ్చి గ్రామాల్లో సిసి రోడ్లు ఏర్పాటు చేయిస్తూ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. సిండికేట్‌నగర్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత సహయ సహకారాలతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరు కావడంతో ఆ నిధులతో సిసి రోడ్డు ఏర్పాటును ప్రారంభించడం జరిగిందన్నారు.

## ఎంఇఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా హనుమంతరావు ఎంపిక

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త**



హనుమంతరావు

మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఇఎఫ్) రాష్ట్ర ఉ పాధ్యక్షులుగా అనంతపురం నగరానికి చెందిన ఎ.హనుమంతరావుని ఎంపిక చేయడం జరిగింది. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు సూచనల మేరకు ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ శనివారం హనుమంతరావుకి నియామక పత్రం అందజేశారు. హనుమంతు రావు వజ్రకరూరు మండలం పిసిపి కొత్తకోట హై స్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యమాల్లో విద్యార్థి దశ నుంచి క్రియాశీలకంగా పని చేశారు. ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఛలో ఢిల్లీ, ఛలో హైదరాబాద్, ఛలో వరంగల్ లాంటి భారీ కార్యక్రమాలకు మాదిగ ఉద్యోగులను, ఎమ్మార్పిఎస్ కార్యకర్తలను తరలించడానికి గుత్తి ప్రాంతంలో తనవంతు కృషి చేశ్యాడు. గతంలో ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, అదనపు ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షునిగా పనిచేస్తున్నారు. గత 20 ఏళ్లుగా ఎంఈఎఫ్ జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పని చేశారు. ఈయన సేవలను గుర్తిస్తూ ఎంఈఎఫ్ అధినాయకత్వం ఈ అవకాశం కల్పించినందుకు ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలుకి, ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి, ఎంఈఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ బండారు శంకర్‌కి తనపై పెట్టిన బాధ్యతకు అనుగుణంగా కష్టపడి పని చేస్తానని, మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎంఈఎఫ్ జాతీయ, రాష్ట్ర కమిటీలతో కలిసి కృషి చేస్తానని హనుమంతరావు తెలిపారు.

## చైతన్య నారాయణ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్‌లు అరికట్టాలి




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ తూరు పరమేష్

**అనంతపురం న్యూటౌన్, నవంబర్ 23 ప్రభాతవార్త**

స్థానిక అనంతపురం నగరంఅలని గనినాయక్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ తూరు పరమేష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా చైతన్య, నారాయణ విద్యా సంస్థలలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్య వ్యాపారం ప్రారంభమైంది. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయక ముందే చైతన్య పాఠశాలలో విద్యార్థులు మా కళాశాలలోనే చేరాలని ఇంటర్మీడియెట్‌కు అడ్మిషన్స్ కావాలనిచెబుతూ తల్లిదండ్రులపై విద్యార్థులపై మానసికంగా ఒత్తిడి గురి చేయడం ప్రారంభించారన్నారు. వెంటనే దీనిపై డీఈఓ, ఆర్ఐఓలు స్పందించాలని లేని పక్షంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు వైటిసి రమేష్, వంశి, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, సూర్యప్రకాష్, రజిత, భీమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదులో రాప్తాడు నియోజకవర్గం అగ్రస్థానంలో ఉండాలి

## - నాయకులు, కార్యకర్తలు మరింత వేగం పెంచాలి




మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

**చెన్నేకొత్తపల్లి, నవంబర్ 23 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాప్తాడు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేలా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శనివారం నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును మరింత వేగం పెంచే విధంగా నాయకుల్ని చైతన్యం చేశారు. చెన్నేకొత్తపల్లి, మండల కేంద్రాల్లోని తెలుగుదేశంపార్టీ, కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు మరింత పెంచే విధంగా పార్టీ నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రాప్తాడు, ఆత్మకూరు మండలాలు సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో ఉండగా, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలు వెనుకంజలో ఉన్న విషయాన్ని పార్టీ శ్రేణులకు తెలియజేశారు. నియోజకవర్గంలో 65వేలకుపైగా సభ్యత్వ నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటికే సగానికిపైగా పూర్తి చేశారన్నారు. అయితే ఈ రెండు మండలాలు మాత్రం వెనుకంజలో ఉన్న విషయాన్ని తెదేపా శ్రేణులకు తెలియజేశారు. కొన్ని క్లస్టర్ల పరిధిలో అనుకున్న టార్గెట్ కన్నా ఎక్కువ ఉండటంపై ఆమె, వారిని అభినందించారు. నియోజకవర్గంలో పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. మనం అధికారంలో లేనప్పుడే పార్టీపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉండేదని, ఇప్పుడు ఆ నమ్మకం మరింత పెరిగిందన్నారు. ఇలాంటి సమయంలో కొందరు సభ్యత్వ నమోదుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, హిందూపురంపార్లమెంట్, ఉపాధ్యక్షులు దండు ఓబులేసు, బిసి సెల్, కుంటిమద్ది రంగయ్య, మాజీ ఎంపిపి అమరేంద్ర, పి.శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, చిన్న ముత్యాలరెడ్డి, ఈడిగ చెన్నకేశవగౌడ్, భార్గవ్, అమరేందర్‌రెడ్డి, ముత్యాలు, కాన శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేవా గుణాన్ని అలవరుచుకోవాలి

## - ఎమ్మెల్యే సింధూర రెడ్డి పిలుపు



ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

**పుట్టపర్తి కలెక్టరేట్, నవంబర్ 23 ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి ఎస్బిఐ రోడ్ లోని ఆర్యవైశ్య ఆధ్వర్యంలో వాసవి సత్రంలో సత్య సాయి బాబా 99వ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం మానవీయ కార్యమన్నారు. సమాజాభివృద్ధికి సంపాదించిన డబ్బును పంచినప్పుడే జీవితానికి సార్ధకత ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులు సేవాగుణంలో ఎంతో ముందు ఉంటారని, వారిని ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ రఘునాథ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు అక్కడ విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ఆర్యవైశ్య సంఘం నాయకులు వాసవి సత్ర సముదాయం శ్రీశైలం అన్నదాన సత్ర సముదాయం కమిటీ అధ్యక్షులు దేవికి వెంకటేశ్వర్లు , వాసవి కమిటీ సభ్యులు పోలేపల్లి ప్రవీణ్ ప్రశాంత్ కుమార్ తిరువీధుల జగదీష్, కలవల రామ్ కుమార్, ఓలేటి శంకర్ బాబు, సెక్రటరీ దర్శి వాసు పున్నయ్య లు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డి, బొమ్మయ్య, ముద్దుపాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు శిబిరాలను తనిఖీ చేసిన కలెక్టర్ చేతన్

**పుట్టపర్తి, నవంబర్ 23 ప్రభాతవార్త**

ఈనెల 24న బిఎల్వోలు ఓటరు నమోదు కేంద్రాలలో కచ్చితంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శనివారం సాయంత్రం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి నగరం,108,109,110, పోలింగ్ కేంద్రాలు, బీడీపల్లి ఓటర్ నమోదు శిబిరాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్2025 లో భాగంగా జిల్లాలో రెండు రోజులపాటు జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో కచ్చితంగా బిఎల్వోలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు వరకు విధులు నిర్వర్తించాలని తెలిపారు. 18సంవత్సరాలు నిండినయువత తమ ఓట్లను ఫారం 6లో నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఫారం 7లో ఎవరైనా చనిపోయిన, శాశ్వతంగా గ్రామం వదిలివెళ్లిపోయిన వారు ఉంటే తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో ఫోటో కరెక్షన్స్, పేరు మరి ఏ ఇతర కరెక్షన్స్ ఉన్నా ఫారం 8 ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ చేతన్

# రాహుల్ కి రాజ్యాంగమంటే అర్థం కూడా తెలియదు

**మొదటిపేజి తరవాయి...** కొంత ప్రభావం చూపిందన్నారు. రాజ్యాంగం అంటే ఏమిటో అర్థం కూడా తెలియని వ్యక్తి రాహుల్ అని, ప్రియాంబుల్ కూడా ఏనాడు చదవలేదన్నారు. రాజ్యాంగాన్ని అవమానించినందుకు రాహుల్ గాంధీ జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. దేశంలోని అనేక పెద్ద రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందన్నారు. ఐదేళ్ల క్రితం 151 సీట్లతో గెలిచిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితమైందని, ప్రజలు పార్టీ పట్ల నమ్మకాన్ని ప్రదర్శించడంతో అనేక రాష్ట్రాలలో బిజెపి వరుసగా గెలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో అవినీతికి పాల్పడడంలో సిద్ధహస్తుడనుకున్న జగన్మోహన్ రెడ్డి అమెరికా లాంటి దేశంలో కూడా అవినీతికి పాల్పడవచ్చని రుజువు చేశాడన్నారు. కేంద్రంలో ఉన్న మంత్రి గడ్కరి వల్ల శ్రీ సత్య సాయి జిల్లాలో జాతీయస్థాయి రహదారుల నిర్మాణం జరుగుతోందని, జిల్లాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయన్నారు. ఈ ప్రాంతాన్ని ఒక ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో పెద్ద సంఖ్యలో భూములు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల రవాణా సౌకర్యాలు సైతం ఇక్కడ ఉన్నాయన్నారు. పుట్టపర్తి ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం మార్పు అనేది అవాస్తవమని, అలాంటి ప్రతిపాదన ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, ఉపాధ్యక్షులు కొండమరాజు, మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవలు మానవాళికి స్ఫూర్తిదాయకం

## - మంత్రి సత్య కుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**పుట్టపర్తి టౌన్ నవంబర్ 23 ప్రభాతవార్త**

సత్యసాయి బాబా సేవలు విశ్వ మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సత్య సాయి బాబా తన ఆధ్యాత్మిక ప్రసంగాల ద్వారా ప్రపంచంలో అనేకమంది భక్తులను సంపాదించుకున్నారని, సత్యసాయి స్ఫూర్తితో సేవేమార్గంగా ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నడుస్తున్నాయన్నారు. తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని, కొన్ని సంవత్సరాల క్రితం భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో ప్రశాంతి నిలయానికి వచ్చి సత్యసాయి ఆశీస్సులు పొందానన్నారు. సత్య సాయి బాబా తన 24వ ఏటని ప్రశాంతి నిలయాన్ని స్థాపించి 70 ఏళ్ల పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని అందులో భాగంగా విద్య, వైద్యము, త్రాగునీరు ప్రజలకు అందించారన్నారు. సత్యసాయి సేవలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రేమే లక్ష్యం సేవే మార్గంగా సత్య సాయి బాబా చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్య సాయి సెంటర్ ట్రస్ట్ చేపట్టిన కలప తరువు ప్రాజెక్టులో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జయంతి ఉత్సవాలు విజయవంతంలో ఎస్‌పి ప్రత్యేక చొరవ



సత్యసాయి జయంతి ఉత్సవాలకు విచ్చేసిన గవర్నర్, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఎస్‌పి వి.రత్న

**పుట్టపర్తి, నవంబర్ 23, ప్రభాతవార్త**

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 99వ జయంత్యుత్సవాలు విజయవంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ పక్షాన జిల్లా ఎస్పీ వి. రత్న ప్రత్యేక చొరవ తీసుకొని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో అవి సత్ఫలితాలను ఇచ్చాయి.ముఖ్యంగా రాష్ట్ర గవర్నర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, మొదలైన ప్రముఖుల పర్యటనలు ఎలాటి లోటు పాట్లు లేకుండా విజయవంతమయ్యేలా ముందస్తు ప్రణాళికతో అధికారులను సమన్వయం చేయడంలో ఎస్పీ కీలకపాత్ర పోషించారు. అలాగే భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం, వీఐపీలు బస చేసిన శ్రీనివాస, శాంతి భవన్ అతిథి గృహాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విఐపిలకు ప్రోటోకాల్‌ను అనుసరించి స్వాగతం పలకడం మొదలుకొని.. తిరిగి వారందరూ బయలుదేరేవరకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి తగిన సలహాలు సూచనలు ఇస్తూ ఎప్పకప్పుడు దిశనిర్దేశం చేశారు. దేశ విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రశాంతి నియానికి విచ్చేసిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అడుగడుగునా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే పలు సేవా కార్యక్రమాలలో పోలీసులు కూడా పాల్గొనడం విశేషం.

# వివాహ రిసెప్షన్ లో పాల్గొన్న బాలయ్య



పుష్పగుచ్ఛమందిస్తున్న డిసి రఘునాథ్ కుటుంబీకులు

**హిందూపురం నవంబర్ 23 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శనివారం రాత్రి మండల టిడిపి అధ్యక్షులు అశ్వర్థ రెడ్డి కుమారుడు కుమారుడి వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసి ఆంజనేయులు కళ్యాణమండపం యజమాని డిసి రఘునాథ్ కుటుంబీకులు బాలయ్యకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తమ అభిమాన హీరో వివాహ వేడుక కు రావడంతో సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు.

# సమర్ధవంతమైన నాయకుడి పాలనకే మహారాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు

## - మహారాష్ట్రంలో బిజెపి గెలుపుపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ వ్యాఖ్యలు




మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

**ధర్మవరం, నవంబర్ 23 ప్రభాతవార్త**

మహారాష్ట్రలో ముచ్చటగా మూడోసారి కూటమి బిజెపి పార్టీ విజయం సాధజంచడం మామూలు విషయం కాదు. ఎన్‌డిఏ సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విజయం సాధజంచడం చాలా సంతోషించ దగ్గ విషయమనిమంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం వద్ద మంత్రి సత్యకుమార్‌యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మధ్య ప్రదేశ్ ఎన్నికల్లో ఎన్డీయే కుటుంబ ప్రభుత్వం విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందని అంతేకాకుండా మిగిలిన రాష్ట్రాల్లో ఓటమి అందుకు గల కారణాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాటిని సమీక్షించుకొని పార్టీని మరింత బలోపేతం చేసుకుని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు తప్పనిసరిగా జరిగే విధంగా కృషి చేస్తామని అన్నారు. అయితే ఇదే తరుణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ గత 40, 50 సంవత్సరాలుగా పెద్ద పెద్ద రాష్ట్రాల్లో తిరుగులేని ప్రభుత్వంగా పని చేసినప్పటికీ ప్రస్తుతం చిన్న చిన్న పార్టీలతో జతకట్టి ఉనికినే కోల్పోతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

# నియోజకవర్గం మహిళా సంఘం సభ్యులు, విఓఏలు రూ.9లక్షలు సహాయం

## సీఎం చంద్రబాబుకు మెగా చెక్కును అందించిన ఎమ్మెల్యే, మహిళా సంఘం సభ్యులు, విఓఏలు,



సీఎం చంద్రబాబుకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ, మహిళా సంఘం సభ్యురాలు, విఓఏలు

**రాయదుర్గం, నవంబర్ 23 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో తుఫాన్ తో కూడిన భారీ వర్షాలు రావడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికావడంతో చాలా ప్రాంతాలు ఆస్థినష్టం ఎక్కువగా జరగం వల్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపుమేరకు నియోజకవర్గంలోని వెలుగు మహిళా సంఘ సభ్యులు మరియు విఓఏలు కలిసి వరద బాధితులకు రూ.9లక్షలు వసూలు చేసి ఈ మొత్తాన్ని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఐదు మండలాల డిడిలు ముఖ్యమంత్రి చంనరదబాబునాయుడికి మెగాచెక్కును అందించారు. ఈ మేరకు శనివారం విజయవాడలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, డిపిఎం ఎల్‌హెచ్ గంగాధర, గోవిందప్ప, ఐదు మండలాల డిడిలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మెగా చెక్కును వరద బాధితుల సహాయార్థం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ మీ స్ఫూర్తి ఇతరులకు ఆదర్శం కావాలని, మీ సంఘాలను బాగా జరుపుకుంటూ ఇంకా మంచి మంచి కార్యక్రమాలు చేయాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యేకి మండల సమైఖ్య ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారన్నారు. అనంతరం డిపిఎం గంగాధర మాట్లాడుతూ ఆపదలో ఉన్న వాళ్లకు మేము సైతం అంటూ ముందుకు వచ్చిన సంఘ సభ్యులకు వెలుగు సిబ్బందికి మరియు గ్రామస్థాయి విఓఏలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసి1/సి గోవిందప్ప, మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పవతి, గుమ్మఘట్ట మండల లక్ష్మీదేవి, బొమ్మనహాళ్ మండల గంగమ్మ, కణేకల్లు మండల వనజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్‌కు చర్యతీసుకోండి

## - బాలయ్యను కోరిన కౌన్సిలర్లు



బాలయ్యతో డిఇ రమేష్, తదితర కౌన్సిలర్లు

**హిందూపురం నవంబర్ 23 ప్రభాతవార్త**

హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్‌తో మాట్లా డి నోటిఫికేషన్ జారీఎలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు స్థానిక మున్సిపల్ కౌన్సి లర్లు కోరారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాలయ్యతో మున్సి పల్‌చైర్మన్ అభ్యర్థి డిఇరమేష్ కుమార్, ఇతర మున్సిపల్ కౌన్సిలర్లు సమావేశమయ్యారు. టిడిపి చైర్మన్ అభ్యర్థి ఎంపిక సమీపించిందనుకుంటున్న సమయంలో అనుకో కుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వైస్ చైర్మన్ బలరాం రెడ్డి చైర్మన్ గా ఆ సీటులో కూర్చోవడం ఆటో కౌన్సిలర్లు, ఇటుప్రజల్లో గందరగోళ పరిస్థితికి తెరతీసిందన్నారు. వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన కౌన్సిలర్లు ఇప్పుడు మరలా వైసిపి చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశంలో పాల్గొనాలంటే ఇబ్బంది గా ఉంటుందని తమ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. వీలైనంత తొందరగా చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతానని బాలయ్య హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే ఎంఎస్.రాజును గుర్తుపట్టి పలకరించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

**మడకశిర నవంబర్ 23 ప్రభాతవార్త;**

పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి బాబా 99 వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వచ్చిన గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు ఆహ్వానం పలకడానికి వెళ్లిన సమయంలో టిటిడి సభ్యులుగా ఎన్నికయ్యారు మీరే కదా అంటూ గవర్నర్ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజును గుర్తుపట్టి మాట్లాడారు. మీరు ఒక్కసారి రాజభవన్‌కు రావాలని సూచించారు. సంతోషం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు రాష్ట్ర గవర్నర్‌కు ధన్యవాదాలు తెలియజేసి జ్ఞాపికను అందజేశారు.

గవర్నకు జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు →



# సత్యసాయి జన్మదినం మానవాళికి పర్వదినం



సత్యసాయి బాబా స్వర్ణ రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

**మొదటిపేజి తరవాయి...**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ మరియు చేనేత శాఖామంత్రి సవిత, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు సింధూర రెడ్డి, ఎమ్మెస్ రాజు పాల్గొన్నారు.సత్యసాయి జన్మదినం సందర్భంగా మహా సమాధిని రంగురంగుల పుష్పాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. సాయి కులం సభ మండపంలో ఉదయం 8 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతి భజన బృందం చేత గురువందన అనే గొప్ప సంగీత గాన కచేరి నిర్వహించారు. ఈ గీతాలలో మధుర మోహన ఘన శ్యామ సుందర సాయి... జిందగీ మే నూర్ బాంకె.. అను భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్ ఎస్ నాగ నంద్ మాట్లాడుతూ సెంట్రల్ ట్రస్ట్ యొక్క కార్యకలాపాలను, వార్షిక నివేదికను సమర్పిస్తూ ఈ వార్షికానికి 237 కోట్లు విరాళాలండయన్నారు. మెడికల్ విభాగానికి 32 కోట్లు వచ్చాయని, విద్యారంగానికి 15 కోట్లు, క్యాంపస్ డెవలప్మెంట్ అండ్ మెయింటెనెన్స్ కి 28 కోట్లు, న్యూరాలజీ మైక్రోసాఫ్ట్, ఎయిర్ లాంగ్ మిషన్స్‌కు ఖర్చయ్యాయని తెలిపారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల ఆలిండియా అధ్యక్షుడు నిమిష్పాండే మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల ద్వారా చెన్నైకి నీరు అందించారని, ఒడిస్సా లో వరదలకు కారణంగా నిరాశ్రయులైన వారికి నూతన గృహాలను కట్టించి ఇచ్చారని, దివ్యాంజన్ పథకం ద్వారా వైకల్యం కలిగిన వ్యక్తులకు కృత్రిమ అవయవాలను సత్యసాయి సేవా సంస్థల ద్వారా దేశమంతా అందజేస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి 2025 జరగబోయే అతిరుద్ర మహా యజ్ఞ ప్రత్యేకతను తెలియజేశారు. కల్పతరు కార్యక్రమం ద్వారా 10 లక్షల మొక్కలను ట్రస్ట్ ఆధ్వర్యంలో నాటుతున్నట్లు తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ సత్య సాయి విద్య వైద్య ఆరోగ్య రంగాలలో, త్రాగునీరు అందించడంలో చేసిన కృషి మానవ మానవులకు సాధ్యం కాదని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యఅతిథి గవర్నర్ అబ్దుల్ నజర్ మాట్లాడుతూ ప్రశాంతి నిలయం సర్వమతాలకు నిలయం అని ఇక్కడ ఉన్న మానవులందరికీ ఒకే కులమని అది దైవ కులం అన్నారు. ఒకే మతమని అది మానవ మతం అన్నారు. ఒకే భాష అని అది హృదయ భాషా అని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగులకు కృత్రిమ ఆవయాలను పంపిణీ చేశారు. ప్రశాంతి



నిలయం క్యాంపస్ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్ వాయిద్యాలను నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకలలో ట్రస్టు సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్,జిల్లా ఎస్పీ వీ రత్న,మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్, మాజీ మంత్రి గీతారెడ్డి, సత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. నయానానందం సత్యసాయి స్వర్ణ రథోత్సవం సత్య సాయి బాబా జయంతి ఉత్సవాలలో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు



గణేష్ గుడి దగ్గర నుండి సాయి కులం సభ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ రథోత్సవం వేదమంత్రాలతో, భజనలతో, మంగళ వాయిద్యాలు నడుమ ట్రస్ట్ వర్గాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కర్ణాటక ప్రముఖ సంగీత విద్వాంసులైన లాల్గుడి జి జి ఆర్ కృష్ణ, విజయలక్ష్మిలా అద్భుతమైన పిడేలు వాయిద్య కార్యక్రమం జరుగుతుండగా సత్యసాయి చిత్రపటాన్ని ఊయలలో ఉంచి జోల మహోత్సవం నిర్వహించారు. తదుపరి ప్రముఖ సంగీత గాయకులైన మల్లాది బ్రదర్స్ వారిచే అద్భుతమైన సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవం భక్తులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసులను సత్కరించారు. అనంతరం మంగళహారతి తో ఈ వేడుకలు ముగిశాయి. ఈ వేడుకలలో వేలాది మంది సాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.